# ఉద్యమకారుల గుర్తింపునకు ఎఫ్ఐఆర్‌ను ప్రామాణికంగా చేయడం సరికాదు: బహుజన సాంస్కృతిక సమాఖ్య

**ప్రత్యేక కమిటీ నిర్ణయాన్ని స్వాగతించిన బీసీఎఫ్.. ఎఫ్ఐఆర్ నిబంధనపై అభ్యంతరం**

**తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అసలైన ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులందరికీ గుర్తింపు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**హనుమకొండ, జూలై 4 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** హనుమకొండ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు పోరాడిన అసలైన ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులను గుర్తించి ప్రభుత్వం తగిన గౌరవం, సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలని బహుజన సాంస్కృతిక సమాఖ్య (బీసీఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే గుర్తింపునకు ఎఫ్ఐఆర్ ఎఫ్ ఐ ఆర్ నమోదే ప్రామాణికంగా పరిగణించడం సమంజసం కాదని స్పష్టం చేసింది. శనివారం హనుమకొండ బాల సముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బొడ్డు కుమార్ స్వామి,(బి కె )వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం శరత్ మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి దశ ఉద్యమం (1969) నుంచి మలిదశ ఉద్యమం (19962014) వరకు వివిధ రూపాల్లో పోరాటాలు సాగాయని వారు గుర్తు చేశారు. సూర్యాపేట తెలంగాణ మహాసభ, భువనగిరి జనసభ, వరంగల్ డిక్లరేషన్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన అనేక రాస్తారోకోలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టాలుగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ ఉద్యమాల్లో వేలాది మంది ఉద్యమకారులు, ప్రజా కళాకారులు ప్రత్యక్షంగా పాల్గొని ఎన్నో కష్టనష్టాలు, లాఠీచార్జీలు, అరెస్టులు, వేధింపులు ఎదుర్కొన్నారని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమ విజయానికి ఉద్యమ కళాకారుల పాత్ర ఎంతో కీలకమైందని, గ్రామీణ స్థాయి నుంచి ప్రజల్లో చైతన్యం కలిగించడంలో పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రజా కళారూపాలు విశేష పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్, ప్రజాకవి గూడ అంజన్న, డప్పు రమేష్, ప్రజా గాయని విమలక్క తదితర ప్రజా కళాకారుల స్ఫూర్తితో తాము ఉద్యమంలో భాగస్వాములై రాష్ట్రవ్యాప్తంగా పనిచేశామని తెలిపారు. గత పదేళ్లలో అసలైన ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులు తగిన గుర్తింపుకు నోచుకోలేదని, కుటుంబాలకు దూరమై ఉద్యమానికే జీవితాన్ని







అంకితం చేసిన అనేక మంది ఇప్పటికీ దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ నిర్ణయమేనని పేర్కొంటూనే, ఎఫ్ఐఆర్ నమోదై ఉంటేనే ఉద్యమకారుడిగా గుర్తిస్తామని చెప్పడం సరైన ప్రమాణం కాదన్నారు. ఉద్యమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కేసులు నమోదవ్వవని, ప్రజాస్వామ్య, గాంధేయ మార్గాల్లో ఉద్యమించిన అనేక మంది ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు లేకుండానే ఉద్యమానికి విశేష సేవలందించారని గుర్తు చేశారు. అందువల్ల ఎఫ్ఐఆర్‌ను తప్పనిసరి అర్హతగా పరిగణించకుండా, ఉద్యమంలో చేసిన సేవలు, పాత్ర, ప్రజా సాక్ష్యాలు, సహచరుల ధృవీకరణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అసలైన ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలో భాగంగా.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను జాప్యం చేయకుండా తక్షణమే అమలు చేయాలని, అసలైన ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బహుజన సాంస్కృతిక సమాఖ్య నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బహుజన సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకులు గురుమిళ్ళ రాజు, సుదమల్ల అశోక్, కునమల్ల నరసింహా స్వామి, పొడేటి ప్రశాంత్, కందిక సుధాకర్, బందెల సదానందం, సుమలత, కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

---

# కరీంనగర్ డీసీ కార్యాలయంలో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య 93వ జయంతి వేడుకలు

**ఆర్థిక సంక్షోభం లేకుండా రికార్డు బడ్జెట్లు ప్రవేశపెట్టిన గొప్ప నాయకుడు రోశయ్య: కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్**

**చివరి వరకు కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధితో సేవ చేసిన నాయకుడు కొణిజేటి రోశయ్య: కాంగ్రెస్ శ్రేణుల నివాళి**

**కరీంనగర్ టౌన్ జులై 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ డిసిసి కార్యాలయంలో కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కంకణాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య 93వ జయంతి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మున్సిపల్ కార్పొరేటర్




వైద్యుల అంజన్ కుమార్ హాజరై ఆర్.జి.పి.ఎస్ జిల్లా చైర్మన్ మడుపు మోహన్ తదితరులతో కలిసి రోశయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని నిర్దేశించి వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ.. రోశయ్య నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం లేకుండా నాటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా అవలీలగా బడ్జెట్ ను ప్రవేశపెట్టి రికార్డు స్థాయిలో ఫైనాన్స్ మినిస్టర్ గా పని చేసిన అనుభవం ఉన్న వ్యక్తిగా కొనిజేటి రోశయ్య రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలలో ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్నారు. వారు చేపట్టిన ఆర్థిక సంస్కరణల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థికంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది, వైయస్సార్ ఇలాంటి అనేకమంది ముఖ్యమంత్రుల నాయకత్వంలో పనిచేసినటువంటి సుదీర్ఘ రాజకీయ అనుభవం నేతగా చివరి వరకు కాంగ్రెస్ పార్టీ పట్ల చిత్తశుద్ధితో పనిచేసిన రోశయ్య సేవలను సమరించుకుంటూ వారికి నివాళులర్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు అహమ్మద్ అలీ, కామ్ రెడ్డి రామ్ రెడ్డి ,ఫహద్,పంజాల స్వామి గౌడ్, ఇమ్రాన్ ఘని,వసీం,అందే శంకర్, రంగు రాజు, రంగు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

---

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు భాధితులకు అందజేసిన రాష్ట్ర నాయకులు సండ్ర



**పెనుబల్లి, జులై 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలోని గణేష్ పాడు గ్రామానికి చెందిన పాలగాని శ్రీను, కొత్త కారయిగూడెం కు చెందిన సాధం సీతరాములు, కు ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులు మాజీ సీనియర్ శాసనసభ్యులు రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య భాధితులకు అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో పెనుబల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కనగాల వెంకట్రావు, దొడ్డపనేని రవి, తెల్లూరి నాగేశ్వరావు, సురేష్ తదితరులు పాల్గోన్నారు.

---

# మల్లంపల్లి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారికి అన్నప్రాసన



**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 4 (పిసిడబ్ల్యూ న్యూస్ ):** మల్లంపల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారం చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమాన్ని మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన అనేది శిశువుకు మొదటిసారిగా ఘన ఆహారాన్ని (అన్నం) తినిపించే సాంప్రదాయ వేడుక అని తెలిపారు. బిడ్డకు ఆరు నెలల వయస్సు పూర్తయిన తర్వాత వారి ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం గురించి తల్లులకు అవగాహన కల్పించే ముఖ్యమైన కార్యక్రమం ఇదని పేర్కొన్నారు.జననం నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారమని, ఆరు నెలలు పూర్తయిన అనంతరం అదనపు పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడుతుందని తల్లులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కొంగర నరేందర్, చేన్నబోయిన కవిత మహేందర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, బాలింతలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

---

# సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముగ్గురు సభ్యులతో కూడిన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు

**డా. మేడిపల్లి సత్యం చైర్మన్‌గా, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి సభ్యుడిగా నియామకం**

**బీఎల్ఏ 2లకు న్యాయ సహాయం కోసం సీనియర్ న్యాయవాది తునికి పవన్ కుమార్ నియామకం**

**ఓటరు జాబితాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా బీఎల్ఏ 2లకు పూర్తి మద్దతు: డీసీసీ ఈసీ**

**కరీంనగర్ టౌన్ జులై 4(పిసిడబ్ల్యూ న్యూస్):** సమగ్ర ఓటరు సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యులతో కూడిన జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ





ఏర్పాటు చేయడం జరిగినది. 1.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా డా. మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే 2. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలోని మండలాలు, పట్టణాలు మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల పట్ల అవగాహన కలిగిన జిల్లాస్థాయి నేతగా డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి3. ఈ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ 2 లకు ఎదురయ్యే సాంకేతిక న్యాయపరమైన ఇబ్బందులు




సమస్యలపై స్పందిస్తూ వాటికి కోర్టు ద్వారా పరిష్కార మార్గాలు చూపే న్యాయ సలహా దారుగా సీనియర్ న్యాయవాది తునికి పవన్ కుమార్ ని నియమించడం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన జిల్లాలోని బూత్ లెవెల్ ఏజెంట్ 2 లు తమ మండల, నియోజకవర్గ స్థాయి ఈ ఆర్ ఓ లను సంప్రదించడం ద్వారా సక్రమమైన పద్ధతిలో ఓటరు సవరణ కార్యక్రమం కొనసాగే విధంగా నిజమైన ఓటర్లకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకునేందుకు బాధ్యత వహించడంలో ఎదురయ్యే సమస్యలపై స్పం దించడానికి పిసిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా వెల్లడించడం జరిగింది.

---

# జగిత్యాల జిల్లాలో బండి సంజయ్ పర్యటన

- **బీజేపీ కార్యకర్తకు బండి సంజయ్ ఆర్థిక సాయం**
- **జగిత్యాల టౌన్‌లో పలువురు బీజేపీ నాయకులను కలిసి కేంద్ర మంత్రి**



**జగిత్యాల జూలై 04(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు జగిత్యాల జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 11 గంటలకు జిల్లాలోని మేడిపల్లి మండల కేంద్రానికి వచ్చిన బండి సంజయ్ అభివృద్ధి పనుల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులను ప్రారంభించారు. భీమారం మండల కేంద్రంలో ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించిన బస్టాండ్ ను ప్రారంభించారు. అక్కడి నుండి కథలాపూర్ మండలానికి విచ్చేసిన బండి సంజయ్ పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పర్యటనలో భాగంగా సిరికొండ వెళ్లిన బండి సంజయ్ ఇటీవల పామాయిల్ తోట కాలిపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బీజేపీ కార్యకర్త ప్రమోద్ నివాసానికి వెళ్లారు. ప్రమోద్ తనకున్న ఎకరన్నర పొలంలో పామాయిల్ పంటను సాగు చేయగా, ఇటీవల పామాయిల్ తోట పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న బండి సంజయ్ ప్రమోద్ కు ఆర్థిక సాయం అందించారు. ఇబ్బంది పడాల్సిన పని లేదని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మరోవైపు బీజేపీ నాయకుల ఆహ్వానం మేరకు బండి సంజయ్ జగిత్యాల పట్టణంలో పలువురు బీజేపీ కార్యకర్తల నివాసాలకు వెళ్లారు. బీజేపీ పట్టణాధ్యక్షులు కొక్కు గంగాధర్ తల్లి ఇటీవల మరణించడంతో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మదన్ మోహన్ తండ్రి మరణించడంతో ఆయన నివాసానికి వెళ్లారు. ప్రముఖ న్యాయవాది సర్వ గంగాధర్ తండ్రి ఇటీవల చనిపోవడంతో ఆయన నివాసానికి సైతం వెళ్లిన బండి సంజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగిత్యాల నుండి మల్యాల వెళ్లిన కేంద్ర మంత్రి ఇటీవల చనిపోయిన బీజేపీ మాజీ మండలాధ్యక్షులు నేరెళ్ల శ్రవణ్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు.

---

# దివంగత మాజీ ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ఘన నివాళులు

**కరీంనగర్ టౌన్ జులై 04(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ దివంగత శ్రీ కొనిజేటి రోశయ్య జయంతి సందర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఘనంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని దివంగత శ్రీ కొనిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కొనిజేటి రోశయ్య ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన ఆదర్శ రాజకీయ నాయకుడని కొనియాడారు. ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన పట్ల ఆయన చూపిన నిబద్ధత భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గారు, డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొయినుద్దీన్, వేణుమాధవ్, అసిస్టెంట్ కమిషనర్ రాజ్ మనోహర్, కార్పొరేటర్లు, మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం




**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండలంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి సీతక్క చిత్రపటాలకు శనివారం ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమం మల్లంపల్లి సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ల్యాద శ్యామ్ రావు మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి, రైతులకు ఆర్థిక భరోసా కల్పించడానికి రైతు భరోసా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఎకరానికి సంవత్సరానికి రూ.12,000 చొప్పున, వానాకాలం మరియు యాసంగి సీజన్లకు విడతల వారీగా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. వానాకాలం పంట పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.6,000 చొప్పున ప్రభుత్వం నిధులను విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను చేపట్టడం రైతులకు ఎంతో ఊరటనిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, ఆత్మ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, హెల్త్ అండ్ మెడికల్ సెల్ వింగ్ చైర్మన్ డాక్టర్ రవిబాబు, జిల్లా కార్యదర్శి దేవేంద్రచారి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిట్టిరెడ్డి రామ్ రెడ్డి, మల్లంపల్లి టౌన్ అధ్యక్షుడు చంద రాము, దేవనగర్ సర్పంచ్ సంతోష్, మహమ్మద్ గౌస్‌పల్లి సర్పంచ్ కార్తీక్, గుత్తూరు తండా సర్పంచ్ రాజు నాయక్, ముద్దునూరు తండా సర్పంచ్ రాజేందర్, గ్రామ పార్టీ అధ్యక్షులు, వార్డు సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిని పరిరక్షించాలి: బీజేపీ మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్







**మల్లంపల్లి, జూలై 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ శనివారం సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1982లో స్థాపించబడిన ఈ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి దశాబ్దాలుగా మల్లంపల్లి మండల ప్రజలకు విశిష్టమైన వైద్య సేవలను అందిస్తోందన్నారు. ప్రస్తుతం ప్రజలు అధికంగా అల్లోపతి వైద్యంపై ఆధారపడుతున్నప్పటికీ, అనేక దీర్ఘకాలిక, మొండి వ్యాధులకు ఆయుర్వేద వైద్యం సమర్థవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. ఈ ఆసుపత్రిలో రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, కాళ్ల నొప్పులు, పక్షవాతం వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధులతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలకు నాణ్యమైన ఆయుర్వేద మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా మల్లంపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఈ ఆసుపత్రి అత్యంత అవసరమైన వైద్య సేవలను అందిస్తూ అండగా నిలుస్తోందన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కొత్త శాశ్వత భవనాన్ని నిర్మించడంతో పాటు ఆధునిక వైద్య సదుపాయాలు, అవసరమైన మౌలిక వసతులు, తగిన సిబ్బందిని సమకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి పోతరాజు సంపత్, గొట్టిముక్కుల నరేష్ శర్మ, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డికి ఘన సన్మానం





**మల్లంపల్లి, జూలై 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీనగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జేడీ మల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డికి ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ నాయకులు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి శ్రీకాంత్ రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అజ్మీర మాన్ సింగ్, ఉపాధ్యక్షుడు తుత్తూరు రాజు, క్లస్టర్ ఇంచార్జ్ నెమలిపూరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుగులోతు లచ్చిరాం, కామా రమేష్, ఆత్మ డైరెక్టర్ బిలావత్ మల్లమ్మ, మాజీ ఉప సర్పంచ్ పటేల్ బాబన్న, గుగులోతు బిక్షపతి, దాసరి రాజన్న, బత్తోజు భీష్మచారి తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# 89లక్షల విలువ చేసే 166 కేజీల గంజాయి పట్టివేత

**ఒడిశా రాష్టం నుంచి హైదరాబాద్‌కు గంజాయి అక్రమ రవాణా**

**నిందితుడిని అరెస్ట్ రిమాండ్ కు తరలింపు**

**వివరాలు వెల్లడించిన సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి**





**సత్తుపల్లి, జూలై 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఒడిశా రాష్టం నుంచి హైదరాబాద్ కు కారులో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో శుక్రవారం ఈగల్ బృందం, పోలీస్ సిబ్బంది కలసి సత్తుపల్లిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో అనుమానస్పదంగా వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా 166 కేజీల 360 గ్రాముల గంజాయి ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి నిందితుడైన ప్రబిన్ భాత్రా ను అదుపులోకి తీసుకోని అతని నుంచి ఒక సెల్ ఫోన్, 500 రూపాయల నగదు, ఒక కారు ను సీజ్ చేయడం జరిగిందని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి తెలిపారు. నిందితుడు ప్రబిన్ భాత్రా, కారు డ్రైవరు గా పని చేస్తాడని, ఒడిశా రాష్టంలో గంజాయిని సరఫరా చేసే బికారి, రోహన్ అనే వ్యక్తి తను తన వద్ద వున్న 80 గంజాయి ప్యాకెట్లను కారులో తీసుకెళ్ళి హైదరాబాదులో తాను చెప్పిన వ్యక్తికి అందచేసిరావాలని, అందుకు గాను 10 వేల రూపాయలు ఇస్తానని చెప్పి AP`39`AT`8240 గల కారు డిక్కీలో 6 ప్లాస్టిక్ సంచులు అందులో వున్న 80 బ్రౌన్ టేప్ చుట్టబడిన గంజాయి ప్యాకెట్లను ఇవ్వగా జులై 3 న తెల్లవారుజామున దారకొండ జంక్షన్ నుండి బయలుదేరి రాజమండ్రి వచ్చి అక్కడ నుండి గ్రీన్ ఫీల్డ్ హైవే లో వస్తూ ఇకముందు పోలీస్ తనిఖీలు వుంటాయని, వేంసూర్ వద్ద హైవే దిగి సత్తుపల్లిలో భోజనం చేసి సత్తుపల్లి మీదుగా హైదరాబాదు వెళ్దామని అనుకోని హైవే దిగి సత్తుపల్లి వస్తుండగా సమాచారం మేరకు పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై ఎన్ డి.పి.ఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా శనివారం ప్రబిన్ భాత్రా ను రిమాండ్ కి తరలించి పరారీలో మిగతా నిందితుల కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం కేసు పరిశోధనలో వున్నదని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గంజాయి నిరోధక చట్టం లో భాగంగా ఎవరైనా వ్యక్తులు గంజాయి కొన్నా కానీ అమ్మినా కాని గంజాయి వినియోగించిన వారిపై పి.డి యాక్ట్ కేసులను నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. గంజాయి రవాణా, నిల్వలపై సమాచారం ఇస్తే వారి వివరాలు పేర్లు గోప్యం వుంటుందని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఎస్సై వీర ప్రసాద్, ఎస్సై ప్రదీప్, ఈగల్ టీం సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నైన్‌పాక గ్రామంలో పోలీసుల 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్





**20 వాహనాలకి ఫైన్, గుడుంబా స్వాధీనం.**

**గ్రామాల్లో గంజాయి మహమ్మారి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి: సీఐ మల్లేష్**



**చిట్యాల జులై 4(పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గారి ఆదేశాల మేరకు చిట్యాల సీఐ. మల్లేష్ ఆధ్వర్యంలో నైన్‌పాక గ్రామంలో పోలీసులు ముమ్మరంగా 'కార్డన్ అండ్ సెర్చ్. ఆపరేషన్ నిర్వహించారు. 24 మంది పోలీసు సిబ్బందితో కలిసి గ్రామంలోని ప్రతి ఇల్లాన్ని, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. **గుడుంబా పట్టివేత – వాహనాలకి ఫైన్:** ఈ తనిఖీల్లో భాగంగా గ్రామానికి చెందిన గుర్రం రాజేశ్వరి అనే మహిళ వద్ద 5 లీటర్ల నాటు గుడుంబా లభ్యమైంది. దీంతో ఆమెపై కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్సై సతీష్ వివరాలు వెల్లడించారు. అదేవిధంగా, సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు గుర్తించి, వాటిని ఫైన్ విధించారు. సిఐ మల్లేష్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే '100' నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. పోలీసులే స్వయంగా బాధితుడి వద్దకు వచ్చి, దరఖాస్తు తీసుకొని అక్కడికక్కడే ఆన్‌సైట్ ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తారని స్పష్టం చేశారు. **గంజాయి నిర్మూలన & సీసీ కెమెరాల ఏర్పాటు:** గ్రామాల్లో యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రజలంతా ముందుకు రావాలని సీఐ పిలుపునిచ్చారు ఈ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో నైన్‌పాక గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్, చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ , చిట్యాల ఎస్సై-2 రాజన్ కుమార్, ఎస్సై-3 ఈశ్వరయ్యలతో పాటు 24 మంది పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఒకటికి నాలుగు ఆశ చూపించి డెకాయిటీలు..


**ముఠా సభ్యులు మరో ముగ్గురు అరెస్ట్**

**నకిలీ పోలీసులు, డమ్మీ కరెన్సీతో అమాయకులను మోసం చేసిన గ్యాంగ్ బట్టబయలు రూ.1.50 లక్షలు, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం: కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్**



**వేంసూర్, జూలై 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అమాయకులకు బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చి ఒకటికి నాలుగు రెట్లు డబ్బు ఇస్తాం అంటూ ఆశ చూపించి, ముందస్తు పథకం ప్రకారం డెకాయిటీలకు పాల్పడుతున్న ముఠాలో మరో ముగ్గురు నిందితులను సత్తుపల్లి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారని కల్లూరు ఎసిపి వసుంధర యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఏసిపి వసుంధర యాదవ్ మాట్లాడుతూ ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపగా, తాజాగా ఏ3 నుంచి ఏ5 వరకు ఉన్న నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముత్తులింగయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతుండగా, కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిందితులు వేంసూరు, లంకపల్లి రోడ్డులో గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్ సమీపంలోని మామిడి తోటలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ తాళ్లూరి కిషోర్ ఫిర్యాదు మేరకు జూన్ 30న కేసు నమోదు చేశారు. అరెస్టయిన నిందితుల్లో వాడపల్లి విజయ్ (రామానగరం), గుమ్మళ్ల సుమంత్ (మల్లాయిగూడెం, ఏలూరు జిల్లా), కొంగల వంశి (తుమ్మూరు) ఉన్నారు. కాగా, ఈ కేసులో ప్రధాన నిందితులు ఈద చంటి బాబు, టీజీఎస్పీ కానిస్టేబుల్ ముళ్లగిరి వర్ధన్‌లను ఇప్పటికే జూలై 2న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు పలువురు పేర్లతో ఫోన్ చేసి తాను రియల్ ఎస్టేట్ వ్యాపారి అని, తన వద్ద ఉన్న బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకోవాల్సి ఉందని చెప్పి బాధితులను నమ్మించేవాడు. నగదు తీసుకురావాలని చెప్పి, అక్కడికి డమ్మీ కరెన్సీ బ్యాగుతో తమ వ్యక్తిని పంపించేవారు. అదే సమయంలో ముందే సిద్ధంగా ఉన్న నకిలీ పోలీసులు దాడి చేసి, దొంగనోట్ల వ్యాపారం చేస్తున్నారంటూ బెదిరించి బాధితుల వద్ద నగదు లాక్కొని పరారయ్యేవారని పోలీసులు తెలిపారు. బాధితులకు అనుమానం రాకుండా తమ వ్యక్తిని కూడా కొట్టినట్లు నటించేవారని వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి రూ.1.50 లక్షల నగదు, ఒక పల్సర్ మోటార్‌సైకిల్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఎస్సై టి. కవితతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ ముఠాకు సంబంధించిన మరిన్ని వివరాలు, ఇతర కేసులపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# నాగన్నకు టీడబ్ల్యూజేఎఫ్ నివాళి



**ఖమ్మం ప్రతినిధి, జూలై 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పరకాల నాగన్నకు టీడబ్ల్యూజేఎఫ్ (2843) ఖమ్మం జిల్లా కమిటీ నివాళులర్పించింది. స్థానిక లెనిన్ నగర్ లో న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయం వద్ద ఉంచిన ఆయన భౌతిక కాయాన్ని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, ఉపాధ్యక్షులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, దువ్వా సాగర్ తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. అరుణోదయ కళాకారునిగా నాగన్న ఆలపించిన గీతాలు ప్రజా చైతన్యానికి వేదికలుగా మారాయని పేర్కొన్నారు. నాగన్న మరణం కళా రంగానికి తీరని లోటని అన్నారు. నిరాడంబరంగా జీవించిన నికార్సైన కమ్యూనిస్టు నాగన్న అని పేర్కొన్నారు. ఆయన ఆలపించిన గీతాలు విప్లవ చైతన్య జ్వాలలను రగిలించాలన్నారు. ప్రజా ఉద్యమాలకు దారి చూపాయని తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. నాగన్న ఆశయ సాధనకు ప్రజాతంత్ర శక్తులు కృషి చేయాలన్నారు. నివాళులు అర్పించిన టీడబ్ల్యూజేఎఫ్ నేతల్లో గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కె. కిరణ్, అర్షద్ తదితరులు ఉన్నారు.

